పొంచి ఉన్న ప్రమాదం

● కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



మానవపాడు రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మానవపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఏర్పాటు చేశారు. ఏ గ్రామంలో చూసినా కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు దర్శనమిస్తున్నాయి. తరచూ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో మూగజీవాలు ప్రమాదాలబారిన పడుతున్నాయి. మండలంలోని ఆయా గ్రామాలలో ఎక్కడ చూసినా జనావాసాల మధ్య, పాఠశాలకు వెళ్లే దారిలో, రోడ్ల వెంట, చెన్నిపాడులో నివాస గృహాల మధ్య నుంచి విద్యుత్ తీగలు ప్రమాదభరితంగా ఉండటంతో భయందోళనకు గురవుతున్నారు. చెన్నిపాడు పాఠశాలకు వెళ్లే దారిలో, నివాస గృహాలు మధ్య, మానవపాడులో గాంధీచౌక్ చౌరస్తా వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

నివాసగృహలపై విద్యుత్ తీగలు

మండలంలోని చెన్నిపాడు గ్రామంలోని కొత్త ఎస్సీ కాలనీలో నివాస గృహాలపై విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు. గత సంవత్సరం కురిసిన ఈదురుగాలులు, వర్షాలకు విద్యుత్ తీగలు గుడిసెపై తెగి పడ్డాయి. సమయానికి గుడిసెలో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని బిక్కు బిక్కు మంటూ జీవిస్తున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి గుండా రోడ్డుపై ట్రాన్స్‌ఫార్మర్ దర్శనమిస్తోందని ప్రమాదాలు చోటుచేసుకోకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

గద్వాల అర్బన్: అంగన్‌వాడీ టీచర్లు, సహాయకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా కేంద్రంలోని సీడీపీఓ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు 40 ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నారని, కానీ వారికి కనీస వేతనం, పెన్షన్, ప్రమాద, ఆరోగ్యబీమా ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. అంతకు ముందు సీడీపీఓ వెంకటేశ్వరికి వినతిపత్రం అందజేశారు. నిరసనలో నర్సమ్మ, వనజ, శారద, రేణుక, యాస్మీన్, సౌభాగ్య తదితరులు ఉన్నారు.

మానవపాడు: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అంగన్‌వాడీ టీచర్ల 72 గంటల సమ్మెలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రాజెక్ట్ ముందు నిరసన తెలిపారు. సమ్మెకు మద్దతుగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాజు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహా, నాయకులు మాలిక్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి ఎమ్మెలమ్మ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌కు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాలికలకు మౌలిక వసతులు కల్పించాలి

శాంతినగర్: రాజోళి కస్తూర్బాగాంధీ పాఠశాలలో చదువుతున్న బాలికలకు మౌలిక వసతులు కల్పించాలని తెలంగాణ క్రాంతిదళ్ ఓయూ అధ్యక్షుడు నాగేష్‌యాదవ్, కన్వీనర్ గొనింటి వీరేష్‌లు డిమాండ్ చేశారు. బుధవారం కస్తూర్బాగాంధీ పాఠశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా బాలికలు వివిధ సమస్యలను వారికి విన్నవించారు. కేజీబీవీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో విద్యార్థుల తరపున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బహుజనులు ఎదగకుండా కుట్ర

గద్వాల అర్బన్: రాజకీయంగా బహుజనులు ఎదగకుండా రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నడిగడ్డ హక్కుల పోరాట సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గం సంక్షేమం, అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. బహుజనులను విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమం పథకాలు అందడంలేదన్నారు. కుటుంబ పాలన నుంచి విముక్తి చేసేందుకు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఓటు విలువ, ప్రజా చైతన్యం, ప్రజా సమస్యలు తెలుకునేందుకు త్వరలో నడిగడ్డ ఆత్మగౌరవ పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో బుచ్చిబాబు, లవన్న, విష్ణు, నెట్టెంపాడు గోవిందు, ప్రేమ్ రాజ్, ఆశన్న, రాజు నాయుడు తదితరులు ఉన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి రథోత్సవం



రథోత్సవ వేడుకల్లో భక్తులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ శివారులో భ్రమరాంబసమేతంగా వెలసిన మల్లికార్జున స్వామి రథోత్సవ వేడకలు బుధవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. రథాన్ని పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి నామస్మరణ మార్మోగింది. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. అంతకు ముందు ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం రథోత్సవాన్ని భక్తులు లాగుచు శివపంచాక్షరి మంత్రం ఆలపించారు. రథం ముందు నందికోల ఆటలు ఆడారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మాతా శిశు సంక్షేమానికి ప్రభుత్వం కృషి



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న మనోరమ

అలంపూర్: మాతా శిశు సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. బుధవారం పట్టణంలోని వ్యాక్సినేషన్ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మాతా శిశు సంక్షేమ కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. వ్యాక్సిన్‌తో టీబీ, క్షయ, కోరింత దగ్గు, ధనుర్వాతం, కామెర్లు, న్యూమోనియా వంటి వ్యాధులు రాకుండా కాపాడుతుందన్నారు. వ్యాక్సినేషన్ ప్రాముఖ్యతను తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, ఏఎన్ఎం సురేఖ, ఆశ కార్యకర్తలు శివలింగమ్మ, పద్మావతి, భారతి, పద్మ, ప్రమీల ఉన్నారు.

త్వరలో వీధికుక్కల తరలింపు

అయిజ: పట్టణంలో ఉన్న వీధికుక్కలను త్వరగా తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని అక్షర పాఠశాల ఆవరణలో విద్యార్థులకు వీధికుక్కలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్నారులు కుక్కలు కనిపించిన వెంటనే పరిగెత్తొదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీరేందర్, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ పాలన గాడి తప్పింది'



మాట్లాడుతున్న సంపత్‌కుమార్

అయిజ: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలన గాడి తప్పిందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రభుత్వం విస్మరించిందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఇసుక, లిక్కర్ దందా, కాంట్రాక్టుల కమీషన్‌లపై ఉన్న శ్రద్ధ ప్రజల బాగోగులపై లేదని విమర్శించారు. అదేవిధంగా అధికార పార్టీ నాయకుల్లో గ్రూపు తగాదాలు, ఆధిపత్యపోరు నడుస్తోందన్నారు. జిల్లా కేంద్రంలో డీపీఓ ఆఫీస్ రికార్డులు దగ్ధమైన అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలు అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు దేవరాజు, జయన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు బీచుపల్లిలో సీతారాముల కల్యాణం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.


బీఎస్పీ యాత్రకు తరలిన నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ అలంపూర్ నియోజకవర్గంలో చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్రకు బుధవారం బీఎస్పీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్ ఆధ్వర్యంలో ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు వాహనాలలో బయలుదేరారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్, ఉపేందర్, ఎం.జి కృష్ణ, ముని, రాముడు, రాంబాబు, బీసన్న, తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన

గద్వాల: గద్వాల మండలం గోనుపాడు శివారులో ఉన్న డంపింగ్ యార్డుతో పాటు ఉన్న పరిసరాలను బుధవారం మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, కమిషనర్ నర్సింహాలు పరిశీలించారు. డంపింగ్ యార్డులో పారబోసిన వ్యర్థాలు, చెత్తచెదారాలపై అక్కడ ఉన్న సిబ్బందికి సూచనలు చేశారు. తడిపొడి చెత్త సేకరణపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలని, ఆ దిశగా చెత్త సేకరణ చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాయలంలో జమ్ములమ్మ ఆలయ సమీపంలో ఉన్న ఫంక్షన్‌హాల్ యజమానులతో సమావేశం అయ్యారు. ప్రతి మంగళవారం జమ్ములమ్మ ఉత్సవాల సందర్భంగా ఫంక్షన్ హాల్‌తో పాటు వాటి పరిసరాలలో పేరుకపోతున్న ప్లాస్టిక్, చెత్తచెదారం, ఇతర వ్యర్థ పదార్థాలను ఎవరికి వారే శుభ్రం చేయించుకోవాలని ఆదేశించారు. లేని ఎడల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న పద్మజారెడ్డి

గద్వాల: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి హెచ్చరించారు. 'ప్రజా గోస- బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక 34వ వార్డులోని కుంటవీధిలో నిర్వహించిన బీజేపీ కార్నర్ మీటింగ్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలను మభ్యపెట్టి మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, వాస్తవాలను ప్రజల ముందుంచితే జీర్ణించుకోవడంలేదని, కేవలం ప్రధాని మోదీ, బీజేపీని తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండల పద్మావతి, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, వార్డు కౌన్సిలర్ బండల పాండు తదితరులు పాల్గొన్నారు.

168 శక్తి కేంద్రాలలో...

కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారంతో పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలనే లక్ష్యంతో గత నెల 15 నుంచి జిల్లా వ్యాప్తంగా బీజేపీ చేపట్టిన శక్తి కేంద్రాల సమావేశాలు, సభలు ముగిశాయి. 'ప్రజాగోస- బీజేపీ భరోసా' పేరుతో రెండు వారాల పాటు గ్రామాలు, వార్డులలో కార్నర్ మీటింగ్‌లను విజయవంతంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 168 శక్తి కేంద్రాలలో సమావేశాలు నిర్వహించారు.

శాంతినగర్: బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాగోశ-బీజేపీ భరోసా యాత్ర బుధవారంతో ముగిసింది. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లో ముగింపు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకులు బంగిలక్ష్మణ్, వాసుదేవరావు, మెడికల్ తిరుమల్‌రెడ్డి, మదన్న, మధుసూదన్‌గౌడ్, బీకే శ్రీను, పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

గద్వాల అర్బన్: వేతన సవరణ కోసం విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఐదోరోజు బుధవారం నిరసన కొనసాగింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో జిల్లా కేంద్రంలోని డివిజినల్ ఇంజనీర్ కార్యాలయం ముందు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ వేతన సవరణ, ఆర్టిజెంట్లకు పర్సనల్ పే బేసిక్‌లో కలపాలని, అన్‌లిమిటెడ్ మెడికల్ పాలసీ తదితర న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ నెల 3 నుంచి డీఈ కార్యాలయం ముందు రిలే నిరహార దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ లక్ష్మణ్, జేఏసీ చైర్మన్ రామకృష్ణ, కో చైర్మన్ అశోక్, కన్వీనర్ శ్రీనివాస్, దేవేంద్రయ్య, వెంకట్రాములు, రాధిక, రెహానా బేగం, ముక్తార్ పాల్గొన్నారు.

పౌష్టికాహార పంపిణీలో అలసత్వం వద్దు

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహార పంపిణీలో అలసత్వం వహించేవారిపై చర్యలు తప్పవని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి హెచ్చరించారు. బుధవారం మల్దకల్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణీ, బాలింతలు చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యం పట్ల తీసుకుంటున్న జాగ్రత్తలను అంగన్‌వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సురేఖమ్మ, మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



సంకాపురంలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అయిజ: కార్యకర్తలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మండలంలోని సంకాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కురువ రాముడు కొన్ని నెలల కిందట ప్రమాదవశాత్తు మృతి చెందాడు. సర్పంచ్ సుజాత, బీఆర్‌ఎస్ నాయకుడు సంకాపురం రాముడు ఆధ్వర్యంలో బుధవారం నామినీగా ఉన్న మృతుడి భార్య సావిత్రికి ఎమ్మెల్యే అబ్రహం పార్టీ ప్రమాదబీమా రూ.2 లక్షల చెక్కు అందజేశారు. అనంతరం మండలంలోని భూంపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న వీరుపాక్షరెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 2.50 లక్షల చెక్కును అందజేశారు. అదేవిధంగా పట్టణంలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచులు, బీఆర్‌ఎస్ నాయకుడు సంకాపురం రాముడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ఇన్సెంటివ్ అవార్డు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం బుధవారం అందజేశారు. అయిజ మండలం పులికల్ గ్రామానికి చెందిన హరిబాబు-సలోమిలు కులాంతర వివాహం చేసుకున్నారు. ప్రోత్సాహకంగా ఇన్సెంటివ్ అవార్డు కింద రూ. 2.50 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారిణి శ్వేత, నాయకులు శ్రీరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీద్దాం

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిలదీద్దామని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం పిలుపునిచ్చారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహ అవసరాల సిలిండర్‌పై రూ. 50, కమర్షియల్ సిలిడర్లపై రూ. 350 పెంచడం దారుణమన్నారు. మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈ నెల 3వ తేదీన నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

కొవ్వొత్తులతో మృతులకు నివాళి



నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

మానవపాడు: శివరాత్రి సందర్భంగా అలంపూర్ జోగుళాంబ దేవి ఆకాశ జ్యోతి సందర్శించి తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఉండవెల్లి మండలం, బైరాపురం శివారు ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో కొర్విపాడు గ్రామానికి చెందిన సాయికుమార్‌గౌడ్(17), రఫీ(18), చంద్రశేఖర్(17) రాత్రి సమయంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీరి మృతికి సంతాపంగా మండలంలోని కొర్విపాడులో బుధవారం గ్రామస్థులు, కుటుంబ సభ్యులు వారి మృతి సంతాపంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, నాగేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



ఆయిల్‌పాం సాగును పరిశీలిస్తున్న అనిత

అలంపూర్: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారిణి అనిత అన్నారు. బుధవారం మండలంలోని క్యాతూర్‌లో శేఖర్ రెడ్డి, రవీందర్ రెడ్డి సాగు చేసిన ఎనిమిది ఎకరాల ఆయిల్‌పామ్ సాగును ఆమె పరిశీలించారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ప్రొత్సాహకం అందిస్తున్నట్లు తెలిపారు. డ్రిప్ కోసం జనరల్ కేటగిరి రైతులకు 80 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీ ఇస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఏడాది నిర్వాహణ కోసం నాలుగేళ్ల పాటు రూ. 4200 అందజేస్తుందన్నారు. వీరితోపాటు ఏఈఓ మానస రైతులు ఉన్నారు.

కొనసాగుతున్న భూ నిర్వాసితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న నిర్వాసిత రైతులు

గట్టు: మండలంలోని చిన్నోనిపల్లెలో బుధవారం ఐదు గ్రామాలకు చెందిన నిర్వాసిత రైతులు బుధవారం 404 రోజు ఆందోళన కొనసాగించారు. చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేసి, రైతుల భూములను రైతులకే అప్పగించాలని కోరారు. ఇది వరకు రైతుల నుంచి సేకరించిన భూములను రైతులకే అప్పగించాలని చాగదోన, చిన్నోనిపల్లె, లింగాపురం, ఇందువాసి, బోయలగూడెం గ్రామాలకు చెందిన నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు.

గద్వాల డీఎస్పీ రహస్య విచారణ

చిన్నోనిపల్లె భూ నిర్వాసితులు చేస్తున్న ఆందోళన గురించి గద్వాల డీఎస్పీ రంగస్వామి ఆరా తీశారు. చిన్నోనిపల్లె గ్రామానికి డీఎస్పీ మంగళవారం చేరుకొని రైతులు వివరాలు సేకరించినట్లు సమాచారం. రిజర్వాయర్ బ్యాలెన్సింగ్ పనులు అడ్డుకోకుండా ముందు జాగ్రత్తగా అన్ని చర్యలు తీసుకుంటున్నారని సమాచారం.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

మానవపాడు: సైబర్ నేరాలపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆన్‌లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలను నమ్మొద్దని, తెలువని మెస్సేజ్‌లు క్లిక్ చేయొద్దని తెలిపారు. సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు పోగొట్టుకుంటే, తక్షణమే 155260, డయల్ 100 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్ వాడే పిల్లలపై తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెల గర్భిణులకు పరీక్షలు

మల్దకల్: ప్రతి నెల గర్భిణులకు పరీక్షలు చేస్తున్నామని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గర్భిణీ, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న గర్భిణీ, బాలింతలు నెలనెలా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పోషకాలు ఎక్కువగా ఉండే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశం

అలంపూర్ రూరల్: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం టీఏ, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీఓ నాగేశాద్రి సూరి సమీక్ష సమావేశం నిర్వహించారు. నర్సరీ నిర్వహణ, ఉపాధికూలీల మొబిలైజేషన్‌పై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్స్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

గద్వాల అర్బన్: హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలో హాథ్ సే హాథ్ జోడో యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అదేవిధంగా గద్వాలలో నియంత్రత్వ, అవినీతి పాలనను అంతమొదించే సమయం ఆసన్నమైందని, రాబోయే రోజుల్లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనని ధీమా వ్యక్తం చేశారు. ఇసాక్, కిఫాయత్, రాజేంద్ర, రఘు నాయుడు, ముక్రం, షాషా, ఉన్నారు.

క్లుప్తంగా

ఆయుష్మాన్ కార్డుకు దరఖాస్తు చేసుకోండి

కేటీదొడ్డి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని సీఎస్‌ఈ మేనేజర్ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీసేవ, కామన్ సర్వీస్ సెంటర్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. కార్డు ఉన్నవారికి కేంద్ర ప్రభుత్వం కుటుంబ మొత్తానికి రూ. 5 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందిస్తుందని తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. అలాగే ఈ శ్రామ్‌కార్డును కూడా నమోదు చేసుకోవాలని కోరారు.

10న 'తెలంగాణ బచావో' సదస్సు



గద్వాల అర్బన్: ఈ నెల 10న తెలంగాణ బచావో సదస్సు నిర్వహిస్తునట్లు తెలంగాణ జనసమితి జిల్లా కన్వీనర్ అలూరు ప్రకాష్ గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నీళ్లు, నిధులు, నియామకాల పేరిట అధికారంలోకి వచ్చిందని ఎనిదేళ్ల పాలనలో పూర్తిగా విస్మరించారన్నారు. హైదరాబాద్‌లో బాగ్‌లింగంపల్లిలో తెలంగాణ బచావో సదస్సుకు నాయకులు, కార్యకర్తలు, మేధావులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. అంతకు ముందు ఈ సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో వీరభద్రప్ప, మహబూబ్, రాజు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వర్గీకరణ కోసం నిరంతర పోరాటం

గద్వాల అర్బన్: ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు నిరంతర పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పోగుల రాజేష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వర్గీకరణ సాధనలో అసువులుబాసిన అమరులకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోగుల రాజేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లును ప్రవెశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మన్యం, మోషన్న, పరుశరామ్, తిమ్మప్ప, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ



మల్దకల్: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి యామినిసాయి కోరారు. బుధవారం మండలంలొని సద్దలోనిపల్లె, నేతువానిపల్లె, మంగంపేట గ్రామాల్లో జీవాలకు మందులు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ యామినిసాయి మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు ఏడాదికి మూడు పర్యాయాలు నట్టల నివారణ మందులను తాపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు అశోక్, వీరేష్, జయమ్మ, పశు వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, రాఘవేందర్, రాజేంద్ర, అర్జున్ సింగ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

అయిజ: మండలంలోని చిన్న తాండ్రపాడుకు చెందిన కొందరు గ్రామస్తులు బుధవారం ఆటోలో పెళ్లి దుస్తులు కొనుగోలు చేసేందుకు మండల కేంద్రానికి వచ్చారు. పనులు ముగించుకొని సొంత గ్రామానికి వెళ్తుండగా పట్టణ సమీపంలో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈ ఘటనలో ఎవరికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వ్యక్తి రిమాండ్

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న ఘటనలో పంచలింగాలకు చెందిన బోయ మద్దిలేటిని అలంపూర్ కోర్టులో బుధవారం హాజరుపరిచారు. జడ్జి విచారణ చేసి 14 రోజులు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు.

సహకార రుణాల వడ్డీ చెల్లించాలి

మానవపాడు: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని 14 గ్రామాల రైతులు రుణాలు తీసుకున్న రైతులు వడ్డీని మార్చి 15వ తేదీ లోపల తప్పకుండా చెల్లించాలని పీఏసీఎస్ సీఈఓ మద్దిలేటి తెలిపారు. బుధవారం మండలంలోని చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాలలో వ్యవసాయ రుణాలపై వడ్డీలను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడువులోగా చెల్లించకపోతే సహకార సంఘంలో తీసుకున్న రుణాలకు 13.75శాతం వడ్డీ కట్టవలసి వస్తుందని పేర్కొన్నారు.